www.kandilinews.com

# కందిలి

న్యూస్.. దారిచూపే దీప శిఖ

సోమవారం | 13.04.2026 సంపుటి: 01 | సంచిక: 246 | వెల: రూ. 4 /- TGTEL/25/A 1800




మీ ప్రాంతంలోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదా? అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదా? ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారా?.. ఇలాంటి సమస్యలు ఏవైనా సరే.. 'కందిలి' దృష్టికి తీసుకురండి.

**70365 45130**

నంబరుకు వాట్సాప్ చేసి వివరాలు అందించండి. అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా కథనాలు అందించి, సమస్యల పరిష్కారానికి మా బాధ్యతగా కృషి చేస్తాం.

ఇట్లు.. టీం కందిలి



## సంగారెడ్డి బైపాస్ రోడ్‌లో...

# 5 చోట్ల జంక్షన్లు!

- ఈ జంక్షన్లను ఆకర్షణీయంగా... ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా తీర్చిదిద్దండి
- ఐబీ జంక్షన్, ఆర్డీవో క్యాంప్ ఆఫీస్ సర్కిల్ జంక్షను ప్రాంతాల్లో పర్యటించిన జగ్గారెడ్డి
- చేపట్టాల్సిన పనుల గురించి హెచ్ ఎండీఏ అధికారులకు సూచనలు

2 లో



## ఆలస్యమైనా...

# ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం!

- కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచింది కార్యకర్తలే
- పటాన్ చెరు నియోజకవర్గానికి ఎంతో ఘన చరిత్ర ఉంది
- 2023 ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో కాట శ్రీనివాస్ గౌడ్ ఓటమిపాలయ్యారు
- అందరూ కలిసి మెలిసి  నిచేయండి...కాబోయే పటాన్ చెరు ఎమ్మెల్యే కాట శ్రీనివాసే
- వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

3 లో



# సంగారెడ్డి బైపాస్ రోడ్‌లో... 5 చోట్ల జంక్షన్లు ఏర్పాటు!



- **ఈ జంక్షన్లను ఆకర్షణీయంగా... ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా తీర్చిదిద్దండి**
- **ఐబీ జంక్షన్, ఆర్డీవో క్యాంప్ ఆఫీస్ సర్కిల్ జంక్షను ప్రాంతాల్లో పర్యటించిన జగ్గారెడ్డి**
- **చేపట్టాల్సిన పనుల గురించి హెచ్ ఎండీఏ అధికారులకు సూచనలు**

**కందిలి, సంగారెడ్డి**

సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్ విస్తరణ పనులు వేగవంతమవుతున్నాయి. రూ.13 కోట్లతో చేపడుతున్న ఈ విస్తరణ సందర్భంగా... బైపాస్ రోడ్ లో అయిదు చోట్ల జంక్షన్లు ఏర్పాటు చేయాలని హెచ్ఎండీఏ అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. ఈ నేపథ్యంలో ఐబీ గెస్ట్ హౌస్ మొదలుకుని బసవేశ్వర చౌక్ వరకు అయిదు చోట్ల జంక్షన్లు ఏర్పాటు కానున్నాయి. హెచ్ ఎండీఏ అధికారులతో కలిసి జంక్షన్లు ఏర్పాటు చేయనున్న ఐబీ చౌరస్తా, ఆర్డీవో క్యాంప్ ఆఫీస్ చౌరస్తాను జగ్గారెడ్డి పరిశీలించారు.

**ప్రజలకు ఆహ్లాదం పంచేలా.. జంక్షన్లను తీర్చిదిద్దాలి!**

జంక్షన్లు ఏ విధంగా ఏర్పాటు చేయాలి? జంక్షన్లలో సుందరీకరణ పనులు ఎలా చేయాలి? జంక్షన్లను ఆకర్షణీయంగా ఎలా తీర్చిదిద్దాలనే విషయాల గురించి అధికారులకు జగ్గారెడ్డి సూచనలు చేశారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా జంక్షన్ల డిజైన్లు ఉండాలని కన్సల్టెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. జంక్షన్ల ఏర్పాటు విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ కు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి కావాలని అధికారులకు జగ్గారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ షఫీ హాఫీజ్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్ , హెచ్ఎండీఏ ఇంజనీర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.






# సిలిండర్ పేలుడు ఘటన... నలుగురికి తీవ్ర గాయాలు!

- **బాధితులను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించిన స్థానికులు**
- **అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలింపు**
- **పేలుడు సంభవించిన ఇంటిని పరిశీలించి**
- **బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్**

**కందిలి, సంగారెడ్డి**

సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటన తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ ప్రమాదంలో సంగమేశ్, మల్లమ్మ, శ్రీజ, అమోస్ లకు తీవ్ర గాయాయ్యాయి. ఘటన చోటుచేసుకున్న వెంటనే స్థానికులు అప్రమత్తమయ్యారు. గాయపడిన వారిని అత్యవసరంగా సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు. పేలుడు గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గాయాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని బాధితులను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించేలా ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు. గ్యాస్ లీకేజీ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన ఇంట్లో ఏడు వాణిజ్య సిలిండర్లు, ఎనిమిది డొమెస్టిక్ సిలిండర్లు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ అంశమై తామూ నివేదిక ఇవ్వనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు.







# ఆలస్యమైనా... ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం!

- కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచింది కార్యకర్తలే
- పటాన్ చెరు నియోజకవర్గానికి ఎంతో ఘన చరిత్ర ఉంది
- 2023 ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో కాట శ్రీనివాస్ గౌడ్ ఓటమిపాలయ్యారు
- అందరూ కలిసి మెలిసి నిచేయండి...కాబోయే పటాన్ చెరు ఎమ్మెల్యే కాట శ్రీనివాసే
- వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ



**కందిలి, పటాన్ చెరు**

''కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచింది కార్యకర్తలే. కాస్త ఆలస్యం అయినప్పటికీ కష్టపడిన ప్రతి కార్యకర్తకు తప్పకుండా న్యాయం జరుగుతుంద''ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. పటాన్ చెరు బస్టాండ్ చౌరస్తాలో ఆదివారం జరిగిన పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఆయనతో పాటు మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి, టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, పార్టీ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్, పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.

**ఛైర్మనుగా శివానందం**

పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మనుగా శివానందం, వైస్ ఛైర్మనుగా రాజశేఖర్, డైరెక్టర్లు ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ తొలుత భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీగా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆయనకు గజమాలలు వేసి, బాణాసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు.

**కాబోయే ఎమ్మెల్యే కాట శ్రీనివాసే!**

''గత ఎన్నికల్లో కాట శ్రీనివాస్ గౌడ్ చాలా తక్కువ ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. దానిని మేం పరాజయం అని అనుకోవడం లేదు. రానున్న ఎన్నికల్లో కాట శ్రీనివాస్ గౌడ్ పటాన్ చెరు ఎమ్మెల్యేగా విజయం సాధించబోతున్నారు. పటాన్ చెరు నియోజకవర్గానికి కాబోయే ఎమ్మెల్యే ఆయనే. మీరంతా కలిసికట్టుగా పనిచేయండి'' అంటూ మంత్రి దామోదర్ రాజనర్సింహ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పటాన్ చెరు నియోజకవర్గానికి ఎంతో ఘన చరిత్ర ఉందని ఆయన వివరించారు. పేదవారికి ప్రామాణికమైన విద్య, నాణ్యమైన వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రైతు సంక్షేమం, విద్య, వైద్య రంగాలతో పాటు మహిళా సాధికారతకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



## సీఎస్ఆర్ నిధుల అవకతవకలపై.. విచారణ జరిపించాలన్న నీలం మధు!

పటాన్ చెరు నియోజకవర్గంలో ఆదివారం జరిగిన పటాన్ చెరు మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి సన్మాన సభకు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామితో కలిసి నీలం మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీలం మధు నూతన వ్యవసాయ కమిటీ ఛైర్మన్ శివానందం, వైస్ ఛైర్మన్ రాజశేఖర్, నూతన డైరెక్టర్లను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ కష్టపడ్డ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలబడుతుందని మరోసారి రుజువైందన్నారు. తన సొంత ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని మోసం చేసి తిరిగి వెళ్లారని విమర్శించారు. నియోజకవర్గ సీఎస్ఆర్ నిధులపై ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే గత పన్నెండు సంవత్సరాలలో జరిగిన నిధుల గోల్ మాల్ పై సమాధానం చెప్పాలన్నారు. పన్నెండేళ్లుగా జరిగిన సీఎస్ఆర్ నిధుల అవకతవకలపై విచారణ జరపాలని మంత్రి వివేక్ వెంకటస్వామికి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

కందిలి
న్యూస్.. దారిచూపే దీప శిఖ
www.kandilinews.com



# తండ్రిని చూస్తూ పెరిగింది..
# శభాష్ మనస్వి అనిపించుకుంది!





- **25 ఏళ్లుగా రైతు ఆత్మహత్యల అంశమై పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు పులిరాజు ఆయన సాగిస్తున్న కృషికి బాధిత కుటుంబాలకు దక్కుతున్న ఊరట**
- **నెల రోజుల క్రితం సాఫ్ట్ వేర్ ఉద్యోగం సాధించిన పులిరాజు కూతురు మనస్వి**
- **తన తొలి వేతనాన్ని తల్లిదండ్రుల సమక్షంలో.. ఆత్మహత్యలు చేసుకున్న వారి భార్యలకు అందించిన మనస్వి**

**కందిలి, సంగారెడ్డి**

తండ్రి చేసే సామాజిక కార్యక్రమంలో తాను కూడా భాగస్వామి అవుతానని నిర్ణయించుకొని అందరితో శభాష్ అనిపించుకుంది ఈ అమ్మాయి. ఇంజనీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగం సాధించిన ఈ యువతి తన మొదటి నెల వేతనాన్ని ఆత్మహత్య చేసుకున్న 5 రైతు కుటుంబాలకు అందించింది. తండ్రి చేస్తున్న పనులను చూసి, తనూ సేవలో బాటలో నడిచి అందరికీ ఆదర్శంగా నిలిచింది.

**25 ఏళ్లుగా తండ్రి పులి రాజు ఆదర్శం!**

గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామానికి చెందిన పులి రాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. గత 25 ఏళ్లుగా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలపై ఆయన అధ్యయనం సాగిస్తున్నారు. బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి, వారి పూర్తి వివరాలు సేకరిస్తుంటారు. ఆ కుటుంబాలకు దాతల సహకారంతో ఆర్థిక సహాయంతో పాటు పిల్లలకు విద్య అందేలా చొరవ చూపుతుంటారు. ఆయన కూతురు పులి మనస్వి ఇటీవల ఇంజనీరింగ్ పూర్తి చేసి ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించారు.

**మొదటి నెల వేతనం..**
**బాధిత మహిళలకు అందించాలని!**

ఈ నెల 10వ తేదీన మనస్వి మొదటి నెల వేతనం అందుకుంది. తనకు వచ్చిన తొలి వేతనం డబ్బులు మొత్తం ఆత్మహత్య చేసుకున్న అయిదు రైతు కుటుంబాలకు అందించాలని నిర్ణయించుకుంది. ఇదే విషయాన్ని తల్లిదండ్రులకు వివరించింది. వారు చాలా సంతోషపడ్డారు. తమ కూతురుకు సమాజం పట్ల ఉన్న స్పృహకు ఉప్పొంగియారు. గజ్వేల్ పట్టణంలో కార్యక్రమం ఏర్పాటు చేసి, మనస్వి కోరిక నెరవేరేలా చూశారు. అయిదు మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.5వేల నగదుతో పాటు ఒక చీరను అందించారు.

**కుటుంబాల పేర్లు:**

1. కుమ్మరి రేణుక, ఎల్కల్ గ్రామం
2. చింతకింది అనూష, వేలూరు, మండలం వర్గల్
3. కొండి మానస, గ్రామం
ఏటిగడ్డ కిష్టాపూర్, RR కాలనీ,
4. తొర్రి రేణుక, ఎల్కల్ గ్రామం
5. గుడిసె కల్యాణి, జాలిగామ గ్రామం





## అగ్ని ప్రమాద బాధితులకు..
# మఠం భిక్షపతి బాసట!

- **పుల్కల్ మండలంలో ఇండ్లు దగ్ధం కావడంతో కట్టుబట్టలతో మిగిలిన రెండు కుటుంబాలు**
- **తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.5వేల నగదు, నెలకు సరిపడా నిత్యావసర వస్తువుల అందజేత**

కందిలి, అందోలు: పుల్కల్ మండల కేంద్రంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. నిరుపేద కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డాయి. ప్రమాదవశాత్తు చోటు చేసుకున్న ఈ ఘటనలో అవుసలి లక్ష్మణ్ చారి, అవుసలి పాండురంగం ఇండ్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ హృదయవిదారక ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మఠం భిక్షపతి స్పందించారు. ప్రమాద బాధితులను పరామర్శించారు. వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

**దీనస్థితిని చూసి...చలించిన మఠం భిక్షపతి!**

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన భిక్షపతి, బాధిత కుటుంబాల దీనస్థితిని చూసి చలించిపోయారు. అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇరు కుటుంబాలకు ఆయన తక్షణ సహాయం అందించారు. మళ్ళీ సాధారణ జీవితం గడిపేందుకు అవసరమైన ఆర్థిక సహాయంతో పాటు, నిత్యావసర సరకులను అందజేశారు. బియ్యం, వంట నూనె, పప్పు ధాన్యాలతో కూడిన కిట్లను పంపిణీ చేసి వారి ఆకలి తీర్చే ప్రయత్నం చేశారు.

**కష్టాల్లో ఉన్నవారిని**
**ఆదుకోవడం మన బాధ్యత!**

"కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం మన బాధ్యత. అగ్నిప్రమాదంలో రెండు కుటుంబాలు నివాసాలను కోల్పోవడం అత్యంత బాధాకరం. ప్రభుత్వం కూడా స్పందించి ఈ పేద కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి. పక్కా గృహాలను మంజూరు చేయాలని కోరుతున్నా"నని మఠం భిక్షపతి అన్నారు. ఆపద సమయంలో తమ వద్దకు వచ్చి ఆర్థికంగా, మానసికంగా ధైర్యం కల్పించిన భిక్షపతికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ క్రిష్ణ రెడ్డి,మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

Printed by SAKETH PUBLICATIONS, Published by Surkanti Rajender Reddy on behalf of Surkanti Rajender Reddy. Printed at Sangareddy and Published at H.No. 5-8-134/8, Plot No.75, Chanakyapuri Colony, Near St.Anthony School, Sangareddy, Telangana- 502001, Editor: Surkanti Rajender Reddy, RNI. NO. TGTEL/25/A 1800. Ph.7036545130. Emai id: Kandilinews@gmail.com